## బైకులో పాము



బైక్‌లో ఉన్న పామును బయటకు తీస్తున్న ప్రజలు

మూసాపేట(అడ్డాకుల), జనవరి 7 : ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువకులు బాలు, వినయ్ హైదరాబాద్‌లో ఓ పరిశ్రమలో పని చేస్తున్నారు. అయితే ఇద్దరు కలిసి బైక్‌పై ఆంధ్రప్రదేశ్‌లోని తాడిపర్తికి వెళ్లి సిమెంట్ పరిశ్రమలో మిషన్‌ను మరమ్మతు చేసి ఆదివారం తిరుగు ప్రయాణమయ్యారు. అయితే మార్గమధ్యలో కర్నూల్ వద్ద బైక్‌లో పెట్రోల్ పోసుకొని బయలు దేరారు. కొంతదూరం వచ్చిన తర్వాత బైక్ తరచూ ఆగిపోతుండడంతో అడ్డాకుల వరకు వచ్చిన తర్వాత మెకానిక్‌కు చూయించారు. బైక్‌లో ఏం సమస్య ఉందో గుర్తించేందుకు మెకానిక్ పరికరాలు విప్పుతుండగా పాము కనిపించింది. దీంతో స్థానిక యువకులంతా కలిసి మోటర్ సైకిల్ ఉన్న పామును బయటకు తీసేందుకు గంటకు పైగా శతవిధాలుగా ప్రయత్నం చేసి చంపివేశారు. అయితే అది రక్త పింజర అని గుర్తించారు. ఆ పాము కాటు వేస్తే ప్రాణహాని ఉండేదని, యువకులకు ఇంకా భూమి మీద నూకలు ఉన్నాయని, అందుకే వారు పాముతోపాటు సుమారు 100 కిలోమీటర్లకు పైగా ప్రయాణించినా వారిని పాము కాటు వేయలేదని అక్కడున్న వారు చర్చించుకున్నారు.

## పోలీసుల చెంతకు గుర్తు తెలియని బాలుడు



పోలీసుల వద్ద ఉన్న బాలుడు

కల్వకుర్తి రూరల్, జనవరి 7 : తల్లిదండ్రుల వద్ద నుంచి తప్పిపోయి రోదిస్తున్న గుర్తు తెలియని బాలుడిని ఆదివారం పోలీసులు గుర్తించారు. కల్వకుర్తి ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కల్వకుర్తి పట్టణంలోని గాంధీనగర్‌లో ఆదివారం సాయంత్రం తల్లిదండ్రుల కోసం రోదిస్తున్న బాలుడిని స్థానికులు గుర్తించారు. వివరాలు అడిగేందుకు ప్రయత్నించగా మాటలు రావని గుర్తించిన వెంటనే 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరకొని బాలుడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. బాలుడిని గుర్తిస్తే కల్వకుర్తి పీఎస్‌లో సంప్రదించాలని సూచించారు.

## పోలేపల్లిలో శిల్పకళాఖండాలను కాపాడాలి

- పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి



చెన్నకేశవ విగ్రహ శిల్పాన్ని పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి

జడ్చర్లటౌన్, జనవరి 7 : జడ్చర్ల మండలం పోలేపల్లి గ్రామంలోని శిథిల ఆలయాలు, శిల్పకళాఖండాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. వారసత్వ స్థలాలు, కట్టడాలను కాపాడుకోవాలన్న అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆయన ఆదివారం పోలేపల్లి గ్రామ పరిసరాల్లో పర్యటించారు. వెయ్యేండ్ల నాటి శివాలయం, చెన్నకేశవ ఆలయం, నిలువెత్తు భైరవ, వీరగల్లు శిల్పాలు, కాకతీయుల నాటి వినాయకుడు, కార్తికేయ, సప్తమాతల శిల్పాలు, భిన్నమైన చెన్నకేశవ శిల్పాన్ని పరిశీలించారు. వీరభద్రుని ఆలయం వద్ద భూమిలో కూరుకుపోయిన క్రీ.శ.1099వ సంవత్సరం, జూలై 18వ తేదీ సోమవారం నాటి శాసనం, కల్యాణిచాళుక్య చక్రవర్తి త్రిభువనమల్ల ఆరో విక్రమాదిత్యుని సైన్యాధ్యక్షుడైన రుద్ర దండనాయకుడు స్థానిక రుద్రేశ్వర, కేశవదేవ, ఆదిత్య దేవుల నైవేద్యానికి భూమిని దానం చేసినట్లుగా వివరాలు ఉన్నాయని తెలిపారు. పోలేపల్లి చెన్నకేశవ, త్రికూటాలయాల చుట్టూ కంప పెరిగి, ఆలయాలు శిథిలమైనట్లు, పురాతనమైన శిల్పాలు నిర్లక్ష్యంగా పడి ఉన్నాయన్నారు. పోలేపల్లి గ్రామ చరిత్రకు అద్దం పడుతున్న వారసత్వ కట్టడాలకు పరిరక్షించి, చారిత్రక శిల్పాలు, శాసనాన్ని కాపాడుకోవాలని గ్రామస్తులకు ఆయన విజ్ఞప్తి చేశారు. పురాతన చారిత్రత్మాకమైన కళాఖండాలను కాపాడుకునే విషయంలో ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ఆయన వెంట మాజీ వీఆర్వో బచ్చన్నగౌడ్, వెంకటరెడ్డి, ప్రణయ్ పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ టోర్నీలో పతకాలు సాధించిన జిల్లా మాస్టర్ అథ్లెట్లు

## మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పతకాల పంట

మహబూబ్‌నగర్‌టౌన్, జనవరి 7 : ఖమ్మంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అథ్లెట్లు 8 బంగారు, 8 వెండి, 2 కాంస్య పతకాలు సాధించారు. టోర్నీలో పతకాలు సాధించడంపై జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌గౌడ్, పరశురాం అభినందించారు. జిల్లాలో ప్రతిభగల క్రీడాకారులకు కొదవ లేదని, ఎంతో మంది జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించారని గుర్తు చేశారు.

పతకాలు సాధించిన క్రీడాకారులు ఫిబ్రవరి 13 నుంచి 17 వరకు పుణెలో జరగనున్న జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ టోర్నీలో పాల్గొననున్నారని తెలిపారు.



ఒంటెపై గంధాన్ని ఊరేగిస్తున్న భక్తులు

## భక్తి శ్రద్ధలతో గంధోత్సవం

- కొనసాగుతున్న అబ్దుల్‌ఖాదర్ దర్గా ఉత్సవాలు
- భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

మహబూబ్‌నగర్ టౌన్, జనవరి 7 : జిల్లా కేంద్రంలోని రాయిచూరు రోడ్డులోని హజ్రత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌షా సాహెబ్ రహెమాతుల్లా అలై దర్గా 85 ఉర్సు ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గంధోత్సవ వేడుకలు ముత్తవల్లి మహ్మద్ అబ్దుల్ జమీల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముత్తవల్లి షేక్‌బడేసాబ్ ఇంటి నుంచి ఒంటెపై బయలు దేరిన గంధోత్సవ ఊరేగింపు అశోక్‌టాకీస్ చౌరస్తా, ఎస్‌బీహెచ్ రోడ్డు, తూర్పుకమాన్, పోలీస్ క్లబ్ నుంచి వన్‌టౌన్ చౌరస్తా గుండా దర్గాకు తీసుకెళ్లారు. గంధోత్సవానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మగ్రిబ్ నమాజ్ అనంతరం దర్గాలో చాదర్ సమర్పించి ఫాతేహాలు అందజేశారు. ఉత్సవాల్లో రాయిచూర్, నారాయణపేట, హైదరాబాద్, గద్వాల ప్రాంతాల నుంచి భక్తులు హాజరయ్యారు.



గంజాయిని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

## మిరపతోటలో గంజాయి సాగు

కోస్గి, జనవరి 7 : కొత్తపల్లి మండలంలోని మిరపతోటలో గంజాయి సాగు చేసిన వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీస్, రెవెన్యూ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. పోలీసులు కథనం మేరకు.. కొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన మున్నూర్ నర్సింహులు వ్యవసాయ పొలంలో సాగు చేసిన మిరప తోటలో గంజాయి మొక్కలను పెంచుతున్నట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడులు నిర్వహించి కేజీ 315 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నర్సింహులును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో తాసీల్దార్ అనిల్‌కుమార్, కోస్గి సీఐ జనార్దన్, ఎస్సై సురేశ్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ మోసం

- రూ.73వేలు కాజేసిన దుండగుడు

మహ్మదాబాద్, జనవరి 7 : మండలంలోని నంచర్ల గేట్‌కు చెందిన అంజిలయ్యకు ఆరోగ్యశ్రీ వర్తించిందని, డబ్బులు కావాలంటే ఫోన్ పే యాప్‌లో రిక్వెస్ట్ పంపిస్తా క్లిక్ చేయమని గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం ఫోన్ చేసి చెప్పాడు. దీంతో అంజిలయ్య అతడు చెప్పినట్లుగానే ఫోన్ పే నుంచి రిక్వెస్ట్‌పై క్లిక్ చేయడంతో రూ.73వేలు కట్ అయ్యాయి. దీంతో బాధితుడు మహ్మదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.



# రైతుబంద్

- నేటికీ అన్నదాతలకు అందని పెట్టుబడి సాయం

- వనపర్తి జిల్లాలో రూ.184 కోట్లకుగానూ కేవలం రూ.18 కోట్లు మాత్రమే చెల్లింపులు
- పది శాతం కూడా జమ కాని డబ్బులు
- ఎకరా రైతులకు కూడా పైసలు నిల్..
- వాయిదాలతో సరిపెడుతున్న కాంగ్రెస్ సర్కారు
- యాసంగి సాగుపై తీవ్ర ప్రభావం
- పెట్టుబడి కోసం దళారులను ఆశ్రయిస్తున్న వైనం

వనపర్తి, జనవరి 7 (నమస్తే తెలంగాణ) : ప్రతి వ్యవసాయ సీజన్‌లో కేసీఆర్ ప్రభుత్వంలో ఆరేండ్లపాటు ఠంచన్‌గా రైతుబంధు సాయం అందించింది. సీజన్‌కు ముందుగా ఏటా వానకాలం, యాసంగిలో రైతుల బ్యాంకు ఖాతాల్లో ఎకరాకు రూ.5 వేల చొప్పున పడుతూ వచ్చాయి. కరోనావంటి ఉపద్రవాలొచ్చినా.. రైతుబంధు పథకం ఏనాడూ ఆగలేదు సరికదా.. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుబంధు పథకం అటకెక్కింది. కేసీఆర్ ప్రభుత్వంలో కంటే మరింత అధికంగా పెట్టుబడి సాయం ఇస్తామని ప్రకటించినప్పటికీ.. దానిని అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ యాసంగి సీజన్ దాటిపోతున్నా మీనమేషాలు లెక్కిస్తున్నది. ఇప్పుడు.. అప్పుడు అంటూ వాయిదాలు వేస్తుండడంతో అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో జిల్లాలోని 1,83,882 మంది అన్నదాతలకు రైతుబంధు సాయం అందించేందుకు జిల్లా వ్యవసాయశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఇందుకుగానూ ఈ సీజన్‌లో వీరికి దాదాపు రూ.184,88,57,833 మేర సాయం అందించాల్సి ఉన్నది. అయితే, ఇప్పటివరకు జిల్లాలో కేవలం 66,185 మంది రైతులకు రూ.18,05,46,137 మాత్రమే ఖాతాల్లో జమయ్యాయి. ఈ సాయం కేవలం ఎకరాలోపు ఉన్న రైతులకు కూడా పూర్తిగా అందలేదు. అయితే ఈ పెట్టుబడి సాయాన్ని గత అసెంబ్లీ ఎన్నికల ముందే అందించే ప్రయత్నం చేసిన క్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో నిలిచిపోయిన సంగతి తెలిసిందే. దీంతో రైతుబంధు సాయం ఇప్పటి వరకు అతీగతి లేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత రైతుబంధు పథకం వాయిదాలు పడుతుంది. ఎలాంటి స్పష్టత లేకుండా ముఖ్యమంత్రి నుంచి ఎమ్మెల్యేల వరకు దాటవేసే ధోరణితో కాలయాపన చేస్తున్నారన్న విమర్శలు తలెత్తుతున్నాయి. ఇప్పటికే యాసంగి సాగుబడుల సమయం ముందుకు వెళుతున్నప్పటికీ పెట్టుబడి సాయం మాత్రం అందనంత దూరంలో ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన రోజు నుంచి అన్నదాతలు సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం చెప్పిన వాయిదాలు గడిచిపోతున్నాయి. గతంలో సీజన్‌కు ముందే డబ్బులు అందుకున్న రైతులు ప్రస్తుత యాసంగి సీజన్‌లో కుదేలవుతున్నారు. మళ్లీ ప్రైవేటుగా అప్పులతో యాసంగి సాగు చేపడుతున్నారు.

### వనపర్తి జిల్లాలో రైతుబంధు వివరాలు

| మండలం | రైతులు | జమ కావాల్సిన రైతుబంధు (రూ.) | తీసుకున్న రైతులు | పొందిన డబ్బులు |
|---|---|---|---|---|
| అమరచింత | 7,738 | 9,63,45,726 | 2,061 | 60,79,802 |
| ఆత్మకూరు | 11,148 | 12,71,38,517 | 3,683 | 1,11,46,733 |
| కొత్తకోట | 17,751 | 14,80,54,818 | 7,997 | 1,98,44,165 |
| మదనాపురం | 9,766 | 9,47,34,606 | 3,990 | 1,09,46,840 |
| చిన్నంబావి | 11,408 | 14,59,49,691 | 2,665 | 78,11,549 |
| పాన్‌గల్ | 19,136 | 19,16,70,584 | 6,083 | 1,68,44,439 |
| వీపనగండ్ల | 11,905 | 15,45,23,176 | 2,902 | 83,43,069 |
| ఖిల్లాఘణపురం | 15,532 | 13,84,38,537 | 6,492 | 1,77,13,763 |
| గోపాల్‌పేట | 14,469 | 13,76,04,367 | 5,486 | 1,51,07,306 |
| పెబ్బేరు | 14,773 | 15,67,17,706 | 5,089 | 1,41,82,539 |
| పెద్దమందడి | 15,211 | 15,07,23,992 | 5,569 | 1,53,20,268 |
| రేవల్లి | 8,339 | 8,73,32,739 | 2,578 | 74,07,765 |
| శ్రీరంగాపురం | 7,785 | 7,07,93,790 | 3,114 | 79,93,140 |
| వనపర్తి | 18,923 | 14,88,29,584 | 8,476 | 2,18,04,759 |
| మొత్తం | 1,83,882 | 184,88,57,833 | 66,185 | 18,05,46,137 |

**జిల్లాలో రూ.162 కోట్లు పెండింగ్..**

రైతుబంధు సాయం జిల్లాలో ఇంకా రూ.162 కోట్ల వరకు రైతుల ఖాతాల్లో జమ కావాల్సి ఉన్నది. రైతులకు అందాల్సిన పెట్టుబడిలో కనీసం 10 శాతం కూడా దాటకపోవడంతో రైతులు గందరగోళంలో పడ్డారు. ఇంకా 1,17,697 మంది రైతులు కంట్లో ఒత్తులు వేసుకొని పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తమ రైతుబంధు సాయం ఏమైందంటూ ఆరా తీస్తున్నారు. అధికారులు సైతం రైతులకు సమాధానాలు చెప్పలేక ముఖం చాటేస్తున్నారు. గతంలో కంటే అధికంగా ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇలా ఎందుకు చేస్తుందో రైతులకు అర్థం కావడం లేదు. ఇటు అధికారులు.. అటు ప్రభుత్వం స్పష్టతనివ్వకపోవడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తేనే డబ్బులు వస్తాయని కార్యాలయాలకు వచ్చిన రైతులకు అధికారులు చెబుతున్నారు. అంతకు మించి ఎలాంటి సమాచారాన్ని ఇవ్వడం లేదు.

**తగ్గిన యాసంగి సాగు..**

గతేడాదితో పోల్చితే ప్రస్తుత యాసంగి సాగు జిల్లాలో సగానికి మించి తగ్గిపోయింది. ఇందుకు రైతుబంధు సాయం సకాలంలో అందకపోవడంతో పాటు ప్రభుత్వం నీటిని నిలిపివేయడం.. వర్షాల ప్రభావం కూడా ఓ కారణంగా చెబుతున్నారు. పోయిన యాసంగిలో 2,14,207 ఎకరాల్లో సాగుబడులు జరిగాయి. ప్రస్తుత యాసంగి సీజన్ వారీగా చూస్తే.. ఇప్పటివరకు 34,081 ఎకరాల్లో సాగు జరిగినట్లు వ్యవసాయశాఖ లెక్కలు చెబుతున్నాయి. ఇంతలా ఒకేసారి రైతన్నలు సేద్యానికి దూరం కావడం పలు అనుమానాలకు దారితీస్తుంది. ఆర్థిక పరిస్థితుల నుంచి రైతన్నలు గట్టెక్కాలంటే ప్రభుత్వ ప్రోత్సాహం తప్పనిసరి అందాలి. ఈక్రమంలో రైతుబంధు సాయం వెనక్కి.. ముందుకు అవుతుండడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ఎన్నికలకు ముందే అందుతుందనుకున్న యాసంగి పెట్టుబడి వాయిదాలు పడుతూ మరింత దూరంగా వెళుతున్నట్లు కనిపిస్తుంది. రైతన్నల ఎదురు చూపులు ఎండమావులు కాకుండా ఉండాలంటే.. కాంగ్రెస్ సర్కారు వెంటనే రైతుబంధు పెట్టుబడులను అన్నదాతల ఖాతాల్లో జమ చేయడం ద్వారానే ఉపశమనం పొందే అవకాశం ఉన్నది.

**కేసీఆర్ ప్రభుత్వంలో..**

అన్నదాతలకు అండగా నిలవాలని కేసీఆర్ సర్కారు 2018లో రైతుబంధు పథకాన్ని తీసుకొచ్చింది. సాగుబడుల్లో పెట్టుబడులకు ఎకరాకు రూ.4 వేల చొప్పున పథకం ప్రారంభంలో అందించింది. క్రమంగా ఈ పథకాన్ని ఎకరాకు రూ.5 వేలకు పెంచి నిరాటంకంగా గత వానకాలం వరకు అమలు పరిచింది. సమయానికి రైతుల చేతుల్లో డబ్బులు ఉండకపోవడం.. ప్రైవేటుగా అధిక వడ్డీలకు డబ్బులు తీసుకొని రైతులు ఆగమవుతున్నారని భావించి రైతుబంధు పథకాన్ని అమలు చేశారు. ఈ పథకం కోట్లాది మంది రైతన్నల కుటుంబాల్లో వెలుగులు నింపిందని చెప్పాలి. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని రైతులు డిమాండ్ చేసే పరిస్థితి ఏర్పడింది.

**ఈ నెల చివరి వరకు సాగు నీటిని అందించాలి**




వానకాలంలో సాగు చేసిన మిరప పంట ఇప్పటి వరకు తెగుళ్లతో ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడిప్పుడే తెగుళ్లు తక్కువ అవుతున్నాయి. ఇంతలోనే రైతులు సాగునీటి విడుదల చేయకుండా క్రాప్ హాలీడే ప్రకటించారు. పంటలు కాపు దశలో ఉన్నాయి. జనవరి చివరి వరకు సాగునీరు అందిస్తే పంటలు చేతికొచ్చేవి. టీబీ డ్యాంలో నీరు లేనందువల్ల మరో రెండు రోజుల్లో సాగు నీరు నిలిచిపోతుందని ఈఈ విజయ్‌కుమార్ చెప్పారు. ఉన్న ఇండెంట్‌ను డిసెంబర్ 15వరకు వాడుకున్నామని, జూరాల డ్యాంలో కూడా నీళ్లు లేవని యాసంగికి నీరందించలేమని ప్రకటించారు. పంట చేతికొచ్చే దశలో నీళ్లలేక పోవడంతో ఏం చేయాలో తోచడం లేదు. అధికారులు స్పందించి పంటలు కాపాడేందుకు ఈనెల చివరి నాటికి సాగు నీరు విడుదల చేయాలి. **- శ్రీను, రైతు, మానవపాడు**

**నీళ్లు బంద్ చేశాం..**



టీబీ డ్యాంలో నీరు లేనందున సాగునీటి సరఫరాను నిలిపివేశాం. డ్యాంలో నీరు లేనందున ముందుగా వాడుకోవాలని అధికారులు సూచించారు. ఈ మేరకు ఆర్డీఎస్ వాటాగా ఉన్న 2.5 టీఎంసీల నీటిని డిసెంబర్ 15 వరకు వాడుకున్నాం. జూరాల డ్యాంలో కూడా నీళ్లు లేవని ముందస్తుగానే యాసంగికి నీటిని అందించలేమని తెలియజేశాం.

**- విజయ్‌కుమార్, ఈఈ**



కాపు దశలో ఉన్న మిరప పంట

# కర్షకుడి కన్నీరు

- మానవపాడు మండలంలో విస్తారంగా మిరప సాగు
- సాగునీరందక అన్నదాతల అవస్థలు
- కాపుదశలో నీటి సరఫరా బంద్
- క్రాప్‌హాలీడే ప్రకటించిన అధికారులు



డీ30 కాల్వలో స్వల్పంగా పారుతున్న నీరు

మానవపాడు, జనవరి 7 : ఒకవైపు తుంగభద్రానది, మరోవైపు కృష్ణానది, జూరాల, ఆర్డీఎస్, తుమ్మిళ్ల లిఫ్ట్ ద్వారా సాగునీరు అందుతుందనే ఉద్దేశంతో రైతులు మండలంలోని ఆయా గ్రామాల్లో మిరప పంటను విస్తారంగా సాగు చేశారు. టీబీ డ్యాం, జూరాల రిజర్వాయర్‌లో నీరు లేకపోవడంతో అధికారులు పంటలకు సాగునీరు అందించలేమని చేతులెత్తేసి క్రాప్ హాలీడే ప్రకటించారు. దీంతో మంచి కాపు దశలో పంటలు ఉండడంతో నీరు లేక పంటలు నష్టపోయే ప్రమాదం ఏర్పడింది. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు ఆందోళన చెందుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రైతులకు పంటలు పండించుకునేందుకు సాగు నీరు పుష్కలంగా అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే రైతుల సాగునీటికి ఇబ్బందులు మొదలయ్యాయి. వానకాలంలో సాగు చేసిన మిరప రైతులకు సాగు నీరు లేక కన్నీళ్లు మిగల్చనున్నాయి. మానవపాడు మండలంలోని 17 గ్రామాల్లో సుమారు 11,700 ఎకరాల్లో మిరప, 2 వేల ఎకరాల్లో కంది, 400 ఎకరాల్లో మొక్కజొన్న, జొన్న పంటలను సాగు చేశారు. ఏటా జనవరి వరకు సాగునీరు అందుతుండేది. దీనిని దృష్టిలో ఉంచుకొని వానకాలంలో మిరప పంటను విస్తారంగా సాగు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో అక్టోబర్‌లోనే నీటి ఎద్దడి నెలకొన్నది. రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి నాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాట్లాడి సాగు నీటిని విడుదల చేయించారు. దీంతో పంటలు పండుతాయనే నమ్మకం రైతుల్లో ఉండేది. జూరాల లింకు కాల్వ ద్వారా డీ40 వరకు సాగునీరు అందించాల్సి ఉన్నది. కానీ ఒక్కసారిగా క్రాప్ హాలీడే ప్రకటించడంతో పంటలు పండవని రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు నదుల మధ్య ఉన్నప్పటికీ సాగునీరందకపోవడంతో కండ్లముందే పంటలు ఎండుతుండడం చూసి తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.